క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సెక్షన్ దుర్గాపురం సబ్‌స్టేషన్ ఐనాక్స్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ డివిజన్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సాంబమూర్తి రోడ్, ఆశ్రమం స్ట్రీట్, దుర్గాపురం, బావాజీపేట, రాజగోపాలాచారి మార్కెట్ ఏరియా, దుర్గివారివీధి, ఆంధ్రరత్న రోడ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

శరవేగంగా యూజీడీ పంపింగ్ స్టేషన్ పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్‌లో యూజీడీ పంపింగ్ స్టేషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంత వాసుల సౌకర్యార్థం అమృత్ పథకంలో భాగంగా యూజీడీ పనులు చేపట్టారు. ఇప్పటికే యూజీడీ పైపులైన్ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం మిగిలిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడ పంపింగ్ స్టేషన్ పనులు పూర్తి అయితే డివిజన్‌లో మురుగు సమస్యతో పాటు దోమల సమస్య కూడా తగ్గే అవకాశం ఉంది.

గాయనీ గాయకుల ప్రతిభను ప్రోత్సహించాలి



విజయవాడ కల్చరల్: గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, జేపీ అండ్ స్వరాజ్, స్వరాంజలి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం జేపీ అండ్ స్వరాజ్ 35వ వార్షికోత్సవం, గాయకులు జోషి, శ్రీనివాసరావులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ ప్రతిభకు ప్రోత్సాహం ఇచ్చినప్పుడే కళాకారులు రాణిస్తారని పేర్కొన్నారు. జేపీ అండ్ స్వరాజ్ వ్యవస్థాపకుడు సంస్థ లక్ష్యాలను వివరించారు. గాయనీ గాయకులు రత్నకుమారి, అమలా రాణి, రేష్మ, సువర్ణలక్ష్మి, అనురాధ తదితరులు పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. నిర్వాహకులు శ్రీనివాసరావు, జోషిలను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో చింతకాయల చిట్టిబాబు, కొప్పుల ఆనంద్, వీరభద్రరావు, వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ సాంస్కృతిక కళారంగాలకు కృషి చేస్తోంది



విజయవాడ కల్చరల్: ఆర్యవైశ్య మహాసభ సాంస్కృతిక కళారంగాలకు కృషి చేస్తోందని శ్రీ కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా ప్రముఖ పారిశ్రామికవేత్త అంబికా రాజా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం నగరంలోని అంబికా రాజా కార్యాలయంలో ఆర్యవైశ్య మహాసభ సభ్యులు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్యవైశ్యుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంబికా రాజా మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని సభ్యులు సహకరించాలని కోరారు.

నిరీక్షణతో జీవించాలి



ఉంగుటూరు: బ్రదర్ జోసఫ్ తంబి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ నిరీక్షణతో జీవించాలని వరంగల్ బిషప్ తుమ్మా బాల స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ తాటికొండ జోసఫ్ అన్నారు. ఉంగుటూరు మండలం పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్‌తంబి 79 వర్ధంతి మహోత్సవాల నవదిన ప్రార్థనలో రెండవ రోజు శుక్రవారం కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన దివ్యపూజాబలిని సమర్పించి 'నిరీక్షణ క్రైస్తవ జీవిత సత్యం'పై ప్రసంగించారు. క్రైస్తవ సత్యాలను తెలుసుకుని గొప్ప ఆశతో క్రీస్తు కోసం నిరీక్షణతో జీవించాలని తెలిపారు. నవదిన ప్రార్థనల్లో పాల్గొన్న గురువులకు రెక్టర్ ఫాదర్ పాలడుగు జోసఫ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విచారణ గురువు ఫాదర్ అభిలాష్ గోప్, పలువురు ఫాదర్లు, సంఘస్తులు పాల్గొన్నారు.





జగన్మాతా.. కరుణించమ్మా..

భవానీలతో ఇంద్రకీలాద్రి అరుణవర్ణ శోభితంగా మారింది. జగన్మాతా.. కరుణించమ్మా... కాపాడమ్మా... అంటూ భవానీల శరణుఘోషతో దుర్గమ్మ సన్నిధి మార్మోగింది. భవానీ దీక్ష విరమణ మహోత్సవాలు శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నాయి. అమ్మవారి ఆలయ పరిసరాలన్నీ భవానీలతో కిటకిటలాడాయి. దేవస్థానం అందిస్తున్న ఉచిత ప్రసాదాల వితరణ బాగుందని భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కెఎస్.రామారావులు దీక్ష విరమణ సదుపాయాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్ర నామ పారాయణం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిర్డీ సాయిబాబా మందిరంలో శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అలాగే పురవీధుల్లో నగర సంకీర్తన జరిగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపు ఆండాళ్ అమ్మవారికి సారె సమర్పణ

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులతో కలిసి ఆండాళ్ అమ్మవారికి సారె సమర్పించనున్నట్లు పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరి తెలిపారు. భక్తులు పలు రకాల పండ్లు, రవిక, వస్త్రాలు, పుష్పాలు, ఇంటి వద్ద చేసిన ఆహార పదార్థాలతో సారె చేతబూని సత్యనారాయణపురం, ముత్యాలంపాడు పురవీధుల మీదుగా మేళ తాళాలతో అమ్మవారికి సారె సమర్పిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

సుపరిపాలనే జగనన్న ధ్యేయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా సుపరిపాలనను అందించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. 30, 57, 59వ డివిజన్లలో 72 మందికి నూతనంగా పింఛన్లు మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం సింగ్‌నగర్ బూదాల ఆదాం కళ్యాణ మండపంలో శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలను చూసిన ఎంతో కొంత స్వార్థ ప్రయోజనాలు చూసుకుని అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అందించేవారని.. కానీ జగనన్న పాలనలో కేవలం ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా పథకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. జగనన్న సీఎం అయిన వెంటనే పింఛన్లను రూ. 2250 పెంచుతూ తొలి సంతకాన్ని చేశారని తెలిపారు. అలానే చిన్న పిల్లల చదువుల కోసం అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, మన బడి నాడు–నేడు పథకాల ద్వారా ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని వివరించారు. వచ్చే



పింఛన్‌ల చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

ఎన్నికల్లో జగనన్నకు మనమంతా అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలు కాస్త లేటుగా వస్తున్నాయేమో కానీ పింఛన్లు మాత్రం ప్రతి నెలా ఒకటో తేదీనే పేదలకు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బీ జానారెడ్డి, ఎండీ షాహినాసుల్తానా, ఇసరపు దేవీ, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, ఇసరపు రాజు, కార్పొరేషన్ యూసీడీ విభాగం అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన తప్పనిసరి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): దేశంలో ప్రజాస్వామ్యం, మానవ హక్కులు సురక్షితంగా ఉండాలంటే చిన్నతనం నుంచే రాజ్యాంగం పట్ల, రాజ్యాంగ విలువల పట్ల అవగాహన పెంచుకోవాలని శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు అన్నారు. బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాన్ని పుస్తక మహోత్సవం ఆవరణలో కేతు విశ్వనాథ రెడ్డి సాహిత్య వేదికపై శుక్రవారం ఆవిష్కరించారు. రాజ్యాంగానికి పునాదిలాంటి రాజ్యాంగ పీఠికను పిల్లలకు అర్థమయ్యేలా చేసేందుకు ఈ పుస్తకాన్ని రూపొందించామని చెప్పారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు సామాజిక శాస్త్రాలను పరిచయం చేయాలన్నారు. యువతలో సామాజిక శాస్త్రాల అధ్యయనం తగ్గి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

పోవడం వల్ల సమాజంలో మూఢత్వం పెరిగి, రాజ్యాంగ విలువలకు ప్రమాదం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జనవిజ్ఞానవేదిక ప్రతినిధులు శ్రీనివాస్, వీజీఎస్ పబ్లిషర్స్ అధినేత శీరం నారాయణరావు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై అవగాహనే లక్ష్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రా నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని రోజ్ షో ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దండా వీరాంజనేయులు, ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి మాట్లాడారు. ప్రజలకు మొక్కలపై అవగాహన కల్పించడంతో పాటు, ఏవిధంగా పెంచాలో తెలియచేడమే ప్రధాన ఉద్దేశంగా తమ అసోసియేషన్ కృషి చేస్తుందని చెప్పారు. విజయవాడ నగరంలో ఏర్పాటుచేసిన గులాబీ మొక్కల ప్రదర్శనతో పాటు, హార్టి కల్చరల్ షోలో తమ పూర్తి సహకారం ఉందని తెలిపారు. గులాబీ మొక్కలతో పాటు అందమైన వివిధ రకాలైన మొక్కలను ఈ ప్రదర్శనలో ఉంచినట్లు పేర్కొన్నారు. రోజ్ సొసైటీ అధ్యక్షుడు మలినేని నారాయణ ప్రసాద్ శుక్రవారం డ్రా తీసి



రోజ్ షోలో మొక్కలపై అవగాహన కల్పిస్తున్న దండా వీరాంజనేయులు తదితరులు

విజేతలను ప్రకటించారు. ఆంధ్రా నర్సరీ అసోసియేషన్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ కె. కిరణ్ కుమార్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కేవీ సత్యనారాయణ, సెక్రటరీ శ్రీనివాసరావు, ట్రెజరర్ కిషోర్ కుమార్, కిరణ్‌కుమార్, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘాట్లలో కట్టుదిట్టంగా పారిశుద్ధ్యం

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): భవాని దీక్ష విరమణకు వచ్చే భక్తులు ఇబ్బందులు లేకుండా ఘాట్లలో ఎలాంటి పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. భవానీ దీక్షలు విరమణ చేసే ఘాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఘాట్ల వద్ద నిరంతరం కన్వేయర్ బెల్టులు వినియోగించి భక్తులు వదిలే వస్త్రాలను ఘాట్లపైకి తరలించాలని, అక్కడే వాటిని ఆరబెట్టేందుకు యంత్రాలు వినియోగించి శుభ్రపరచాలని సూచించారు. దీక్ష విరమణకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావుని ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి భక్తులకు కల్పించిన సదుపాయాలను పర్యవేక్షించాలన్నారు. ఘాట్‌ల వద్ద యాత్రికులు స్నానాలు ఆచరించేందుకు అందుబాటులోని సదుపా



ఘాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

యాలు, కేశఖండనశాల వద్ద ఏర్పాట్లు పరిశీలించి, పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల క్యూ లైన్‌ల వద్ద, గిరి ప్రదక్షిణ ప్రాంతం మొత్తం పరిశీలించి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, స్పెషల్ ఆఫీసర్లకు ఆదేశాలు ఇచ్చారు. మూడు షిఫ్టుల్లో పారిశుద్ధ్య నిర్వహణ జరిపించాలని, భక్తులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని తాత్కాలిక మరుగుదొడ్ల వద్ద పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. చీఫ్ ఇంజినీర్ యం.ప్రభాకర్ రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, హెల్త్ ఆఫీసర్–3 ఇక్బాల్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్‌లో స్పానిష్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్‌సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధి ఆధారిత విదేశీ భాష స్పానిష్ సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పానిష్ భాష సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసిన వారికి ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. కావున యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల మూడోవారం నుంచి తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. మరింత సమాచారం కోసం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంగ్లీషు విభాగంలో స్వయంగా కానీ, 8143929613 ఫోన్ నంబర్‌లో కానీ సంప్రదించాలని కోరారు.

ఉరుసు మహోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ వాంబేకాలనీలోని ఆస్థాన ఎ గరీబ్ నవాబ్ అజ్మీర్ షరీఫ్ ఖాజా బాబా ఆశ్రమం 8వ వార్షికోత్సవ వేడుకలు, ఉరుసు మహోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా శుక్రవారం ఆవిష్కరించారు. జనవరి 19వ తేదీ నుంచి జరిగే ఉత్సవాల పోస్టర్లను వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, ఎండీ హఫీజుల్లా, ముస్లిం మతపెద్దలతో కలసి సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. నిర్వాహకులు తొలి ఆహ్వాన పత్రికను ఎమ్మెల్సీ రుహుల్లాకు అందజేశారు. ముస్లిం మత గురువులు సయ్యద్‌అబ్దుల్లా నిజామి సాహెబ్, ఆశ్రమం కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త పఠాన్‌బాబ్జి ఉమర్‌ఖాన్, బిల్డర్ జిలాని, వహీద్‌బాబా, షేక్ వెంకట్, భాష, జాని పాల్గొన్నారు.

10 నుంచి రంగవల్లుల పోటీలు

కంకిపాడు: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని రక్ష ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన పెనమలూరు నియోజకవర్గంలో రంగవల్లుల పోటీలు నిర్వహించనున్నట్లు రక్ష ఫౌండేషన్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్, పడమట స్నిగ్ధ చెప్పారు. ఆమె శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి పండుగ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకన్నారు. సంక్రాంతి సందర్భంగా నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, వైఎస్సార్ తాడిగడప, ఉయ్యూరు మున్సిపాలిటీల్లో 90కిపైగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మహిళలు, యువతులకు రంగవల్లుల పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకూ ఆయా సచివాలయాల పరిధిలో రంగవల్లుల పోటీలు జరుగుతాయని తెలిపారు. రంగవల్లులు తీర్చిదిద్దేందుకు అవసరమైన సామగ్రిని పూర్తిగా తామే అందిస్తామన్నారు. పాల్గొనదలచిన ఔత్సాహిక మహిళలు, యువతులు 8790937269, 9848828222 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. వాట్సాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కఠోర శ్రమతోనే విజయం

పటమట(విజయవాడతూర్పు): పోటీ పరీక్షలకు హాజరయ్యేవారు ప్రతి రోజూ దినపత్రికల్లో వచ్చే కరెంట్ ఎఫైర్స్‌ను పరిశీలించాలని, దీనికి కఠోర శ్రమ తోడైతేనే విజయాన్ని సాధిస్తారని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. పటమటలోని సర్వోత్తమ గ్రంథాలయంలో గ్రూప్–2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపజయం విజయానికి దారి తీస్తుందని, సిలబస్, ప్రశ్నల సరళితోపాటు గతంలో జరిగిన పేపర్లు క్షుణ్ణంగా అవగాహన చేసుకుని నోట్స్ ప్రిపేర్ చేసుకోవాలని సూచించారు. హిస్టరీ, జాగ్రఫీ, భారత సమాజం, కరెంట్ ఎఫైర్స్‌తోపాటు మెంటల్ ఎబిలిటీ అంశాల్లో 30 మార్కులు చొప్పున 150 ప్రశ్నలుంటాయన్నారు. ఇందులో 90 మార్కులకు పైన సాధిస్తేనే మెయిన్స్‌కు అర్హత సాధిస్తామని తెలిపారు. అందులో 300 మార్కులు ఉంటాయని, వాటిలో ప్రధానంగా ఆంధ్రుల చరిత్ర, ఇండియన్ పాలిటీ, భారత–ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ శాస్త్రాలతోపాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లో నాలుగు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పేపర్లు ఉంటాయని వెల్లడించారు. ఒక్కో దానికి 75 మార్కుల చొప్పున ప్రశ్నలుంటాయని వివరించారు. ప్రిలిమ్స్, మెయిన్స్ సిలబస్‌తోపాటు ఇటీవల పరీక్షలకు ఇస్తున్న ప్రశ్నావళిపై కూడా అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు భారత సమాజం, ఆంధ్రుల చరిత్ర, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థలపై ఆయన రచించిన పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి రావి శారద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నేర్చుకునే తత్వం పెంచుకోవాలి

రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ డైరెక్టర్ పి.పార్వతి

గుణదల(విజయవాడ తూర్పు): విద్యార్థులు నిత్యం నేర్చుకునే తత్వం కలిగి ఉంటే గొప్ప వ్యక్తులుగా మారతారని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ డైరెక్టర్ పి.పార్వతి తెలిపారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) విజయవాడ బ్రాంచి 77వ వ్యవస్థాపక దినోత్సవాన్ని విజయవాడ హయత్ ప్లేస్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పి.పార్వతి విచ్చేసి మాట్లాడారు. సైంటిస్ట్ ప్రతినిధి ఎంఏజే వినోద్ ప్రారంభోపన్యాసం చేశారు. అల్ట్రాటెక్ సిమెంట్ జనరల్ మేనేజర్ ఆర్.పరమానందం, బీఐఎస్ విజయవాడ జాయింట్ డైరెక్టర్లు టి.సుజాత, రాజశేఖర్, సాయి కుమార్ తదితరులు ప్రసంగించారు. ఐఎస్ఐ మార్క్ చేసిన వస్తువులను, హాల్ మార్క్ చేసిన బంగారు ఆభరణాల ధ్రువీకరణ కోసం బీఐఎస్ కేర్ యాప్‌ను ఉపయోగించాలని సూచించారు. ఎగుమతులు, దిగుమతుల ప్రత్యామ్నాయాల్ని ప్రోత్సహించడం, హాల్ మార్కింగ్, సర్టిఫికేషన్



బీఐఎస్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

టెస్టింగ్ తదితర వాటి విస్తరణకు కృషి చేస్తోందన్నారు. బీఐఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గతేడాది డిసెంబరు 9వ తేదీన జరిగిన ప్రాంతీయ స్థాయి ఆన్‌లైన్ క్విజ్ పోటీల విజేతలను సత్కరించారు. స్టాండర్డ్స్ క్లబ్‌లకు చెందిన 30 మంది విద్యార్థులు నగదు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి కింద రూ.5వేలు, ద్వితీయ బహుమతికి రూ.3వేలు, తృతీయ బహుమతికి రూ.2వేలు, ప్రోత్సాహక బహుమతులకు రూ.వెయ్యి చొప్పున అందజేశారు. 150 మంది అతిథులు హాజరయ్యారు. ఇందులో బీఐఎస్ క్లబ్ మెంబర్లు, మెంటర్లు ఉన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండండి

సీపీ టీకే రాణా

విజయవాడ స్పోర్ట్స్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం వద్ద భవానీ దీక్షల విరమణ విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశించారు. ఆలయ సమీపంలోని దుర్గాఘాట్ వద్దనున్న మోడరన్ గెస్ట్ హౌస్‌లో బందోబస్త్ విధుల్లో ఉండే పోలీసు అధికారులు, సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సీపీ రాణా మాట్లాడుతూ శుక్రవారం రాత్రి నుంచి భవానీలు అధిక సంఖ్యలో వస్తారని అన్నారు. బందోబస్త్ నిర్వహించే ప్రదేశాల్లో భక్తుల క్యూలైన్ నిత్యం సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కనకదుర్గానగర్‌లోని హోమగుండాలు, మాల ఇరుముడి, ప్రసాదం కౌంటర్ల వద్ద భక్తులు నిలబడకుండా చూడాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రాణా

విధుల్లో అలసత్వం వహించకుండా భక్తులకు ప్రశాంత వాతావరణంలో అమ్మవారి దర్శనం అయ్యేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని నిత్యం అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. డీసీపీలు విశాల్ గున్ని, కె.చక్రవర్తి ఆలయ ఈఓ కె.ఎస్.రామారావు పాల్గొన్నారు.

విజయవంతంగా ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ

– వీఎంసీ ఏసీ సత్యవతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆడుదాం ఆంధ్రా, జన్ భాగిదారి, ఆరోగ్య రక్ష 2.0 వంటి ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి అధికారులు, సచివాలయ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు ఆమె శుక్రవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జోనల్ అధికారులు, సచివాలయం సిబ్బందితో ఆయా ప్రభుత్వ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా నిర్వహణ గురించి సచివాలయం సిబ్బంది సమర్పిస్తున్న నివేదికపై చర్చించారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. అదే విధంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమంపై సచివాలయం ఇచ్చిన నివేదికపై కూడా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అంబేడ్కర్ స్మృతివనాన్ని ఈ నెల 19న ప్రారంభించనున్న నేపథ్యంలో అంబేడ్కర్ మార్గదర్శకాలను ప్రజలకు తెలియచెప్పేందుకు ఈ నెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ప్రతీ సచివాలయంలో 'జన్ భాగిధారి' కార్యక్రమాన్ని నిర్వహించాల్సిందిగా సచివాలయం సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.